క్లుప్తంగా

బందోబస్తును పరిశీలించిన డీసీపీ



శోభాయాత్రలో పాల్గొన్న డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని గురువారం సాయంత్రం షాద్‌నగర్ పట్టణంలో శ్రీరాముడి శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి బందోబస్తును పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టాలని స్థానిక ఏసీపీ కుషాల్కర్, సీఐ నవీన్‌కుమార్‌లకు సూచించారు.

ధ్యానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆంజనేయరెడ్డి

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల, పాటిగడ్డ, కొనాయపల్లి, బైర్కాన్‌పల్లి, మంగళిగూడ గ్రామాల్లో స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ధ్యానంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి తన బృందంతో ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, వెంకటలక్ష్మి, శైలజ, జ్యోతి, బాలకృష్ణారెడ్డి, రాములు, జంగయ్య, శ్రీనివాస్, వేణు, సురేష్‌రెడ్డి, రాంచంద్రయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న పంతంగి మాధవి

మీర్‌పేట: నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రశాంతిహిల్స్ రోడ్ నెం-15లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శోభకృత్ నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ పంతంగి మాధవి ముఖ్యఅతిథిగా హాజరై పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట, మీర్‌పేట నగర సంఘం అధ్యక్షులు మంగు రాఘవరావు, రంగరాజు యాదగిరిరావు, ఉపాధ్యక్షుడు జిల్లెల మధుసూదన్‌రావు, సుభాష్, చంద్రబోస్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

అదను చూసి.. ఆర్టీసీ బాదుడు

యాలాల: శ్రీరామనవమి ఉత్సవాలకు వచ్చే భక్తుల నుంచి ఆర్టీసీ అధికారులు అధిక చార్జీలు వసూలు చేయడం అన్యాయమని సీపీఎం మండల కార్యదర్శి బుగ్గప్ప అన్నారు. జాతరకు తాండూరు నుంచి జుంటుపల్లి వరకు తాండూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారని, 12 కిలోమీటర్ల దూరం గల వేడుకలకు రూ.20కి బదులు రూ.50 వసూలు చేయడమేంటని ప్రశ్నించారు. అంతే కాకుండా.. కర్ణాటక రాష్ట్రం చించోలి పేరుతో ముద్రించిన టికెట్లను ఈ 12 కి.మీ. దూరాకిని విక్రయిస్తున్నారని మండిపడ్డారు. దైవ చింతన కోసం వచ్చే భక్తుల నుంచి రవాణా చార్జి పేరుతో అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడిన సంబంధిత ఆర్టీసీ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని బుగ్గప్ప డిమాండ్ చేశారు.

నేడు సర్వసభ్య సమావేశం

కుల్కచర్ల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తామని పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సమీక్ష జరగనుందని, మండల పరిధి రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తాగునీరు, మజ్జిగ పంపిణీ

కొడంగల్: జుంటుపల్లి శ్రీరాములవారి కల్యాణోత్సవం సందర్భంగా జాతరకు వెళ్లే దారిలో భక్తులకు గురువారం తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. తాండూరుకు చెందిన గౌస్‌బాబా ఆధ్వర్యంలో ఆయన శిష్యులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేశారు. భక్తులు హర్షం వ్యక్త చేశారు. ఈ కార్యక్రమంలో రవిపటేల్, కానుకుర్తి నర్సిరెడ్డి, శ్యామప్ప, గౌసన్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొడంగల్ రూరల్: గాంధీనగర్ కాలనీకి చెందిన సంపల్లి పద్మమ్మ(48) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి.. వెంకటప్ప ద్వారా గురువారం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేదలకు అండగా ఉంటామన్నారు.



కొందుర్గు: లాల్‌పహాడ్‌లో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



కేశంపేట: శ్రీరాముని కల్యాణంలో పాల్గొన్న విశాల



మొయినాబాద్‌రూరల్: సీతారాముల, లక్ష్మణుల విగ్రహాల ఊరేగింపు

కల్యాణం .. కమనీయం

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

శ్రీరామనవమిని పురస్కరించుకొని పచ్చని పూల పందిళ్లు..మామిడాకుల తోరణాలు..వేద పండితుల మంత్రోచ్ఛరణలు..ముత్యాల తలంబ్రాలు.. బాజాభజంత్రీలు..అశేషభక్త జన వాహిని మధ్య జగదాబి రాముడి కల్యాణోత్సవం గురువారం షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లోని ఆయా ఆలయాల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఫరూఖ్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆయా ఆలయాలకు భక్తులు పోటెత్తారు.. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రామ నామ సర్మణతో ఆలయాలు మార్మోగాయి.

– సాక్షి, నెట్‌వర్క్



షాబాద్: రాములోరి కల్యాణంలో పాల్గొన్న ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య



షాద్‌నగర్ : దేవతామూర్తుల విగ్రహాలతో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



షాద్‌నగర్: శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మొయినాబాద్: కల్యాణం జరిపిస్తున్న సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి దంపతులు



కొత్తూరు: తాళిబొట్టు తీసుకొస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దంపతులు



షాబాద్: తలంబ్రాలు సమర్పిస్తున్న జెడ్పీటీసీ అవినాష్‌రెడ్డి సతీమణి సాన్వి



శంకర్‌పల్లి: కల్యాణోత్సవంలో పాల్గొన్న చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి



మొయినాబాద్ రూరల్: ఎన్కేపల్లిలో సీతారాముల కల్యాణోత్సవం

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

రాష్ట్ర బీఆర్ఎస్ కార్యవర్గ సభ్యుడు అనంతరెడ్డి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు అనంతరెడ్డి

మొయినాబాద్‌రూరల్: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర బీఆర్ఎస్ కార్యవర్గ సభ్యులు కొంపల్లి అనంతరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజయ్య, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ శ్రీహరియాదవ్‌లు అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో గత పది సంవత్సరాల నుంచి రాష్ట్రంలో దాదుసేవక్ సమాజ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం హిమాయత్‌నగర్ చౌరస్తాలో దాదుసేవక్ సమాజ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతరెడ్డి, రాజయ్య, రవియాదవ్, శ్రీహరియాదవ్‌లు పాల్గొని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. దాదూసేవక్ సమాజ్ వారు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జాతీయ రహదారి హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఎంతో మంది ప్రయాణికులు, ప్రజలు తిరుగుతుంటారని అన్నారు. ఈ సంవత్సరం ఎండలు అధికంగా ఉండడంతో ఈ చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారస్తులు, యువజన సంఘాలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మొయినాబాద్ మండల పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మహేష్, మాల యాదయ్య, మాలస్వామి, రమేష్, దాదూ సేవక్ సమాజ్ సంస్థ నాయకులు జటమల్ చండక్, గన్‌శ్యామ్‌దాస్, రాజేష్‌దాదూ, పురుషోత్తమ్ లడ్డా, నందకిషోర్ చండక్, కేశవ్ చండక్ తదితరులు పాల్గొన్నారు.

చలి వేంద్రం ఏర్పాటు హర్షణీయం: ఎమ్మెల్యే

మోమిన్‌పేట: వేసవి కాలంలో చలి వేంద్రాల ద్వారా ప్రయాణికులు, బాటసారుల దాహార్తి తీర్చడం సంతోషకరమని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని, దాహంతో ఉన్నవారికి తాగునీటి అందించాలనే గొప్ప మనస్సుతో దాతలు ముందుకు రావడం గర్వించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్, నాయకులు మైపాల్, శోభన్, సందీప్, రాజు ఉన్నారు.

దివ్యాంగుడి సేవాగుణం అభినందనీయం



అంబలి తాగుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు వసంతం, స్థానిక నేతలు

చేవెళ్ల: మండలకేంద్రంలోని విజయ్ మెడికల్ షాపు సమీపంలో షాబాద్ మండలంలోని చందన్‌వెల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు మనోహర్ శ్రీసాయిబాబా ఉచిత అంబలి కేంద్రం ఏర్పాటు చేశాడు. ప్రతిరోజు సొంత డబ్బులతో ఖర్చుపెట్టి అంబలిని ప్రజలకు పంపిణీ చేస్తున్నాడు. గత రెండు మూడు రోజులుగా మండలకేంద్రంలో అంబలి కేంద్రం కొనసాగుతోంది. ఓ దివ్యాంగుడు తనకు వచ్చే పింఛన్, కూలీ డబ్బులతో ఉచిత అంబలి కేంద్రం ఏర్పాటు చేసి అందించడం అతని సేవాగుణాన్ని పలువురు మండల ప్రజలు అభినందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు ఎస్. వసంతం గురువారం అంబలి కేంద్రానికి వెళ్లి అంబలి తాగాడు. అతని సేవాగుణాన్ని మెచ్చుకొని రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రజలు ఈ అంబలి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటాం

బీజేపీ నేత ఆచారి ఫైర్

ఆమనగల్లు: మున్సిపాలిటీ పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా ఆమనగల్లు పట్టణంలో మంత్రి కేటీఆర్ చేపట్టనున్న పర్యటనను అడ్డుకుంటామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి హెచ్చరించారు.ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆచారి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ స్థానికంగా జరిగే అభివృద్ధి పనుల విషయమై పాలకవర్గానికి ఎటువంటి సమాచారం ఇవ్వటంలేదని మండిపడ్డారు. మున్సిపాలిటీ అభివృద్ధికి 2017లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి రూ.15 కోట్లు ప్రభుత్వం నుంచి గ్రాంట్‌గా మంజూరు చేయించారని చెప్పారు. గతంలో మున్సిపాలిటీ పాలకవర్గం రూ.15 కోట్లతో చేపట్టే పనులకు సంబంధించి ప్రణాళిక రూపొందించి ఆమోదించిందని ఆయన వివరించారు. గత ఏడాది పనులకు సాంకేతిక అనుమతులు రాగా ఆరు నెలల క్రితం టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభించే సమయంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధికారులపై ఒత్తిడి తెచ్చి పనులను ఆపించారని ఆరోపించారు. ప్రస్తుతం మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్‌నాయక్.. పాలకవర్గానికి కనీస సమాచారం ఇవ్వకుండా ఆయా పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని ఏప్రిల్ 3న నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సాకిబండ తండా సమీపంలో ప్రజాభిప్రాయం సేకరించకుండా మైనింగ్ పనులకు అనుమతి ఇచ్చారని ఆరోపించారు. మైనింగ్‌లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ భాగస్వామి అని.. అందుకే గిరిజనులు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. సమావేశంలో చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, చెన్నకేశవులు, శ్రీధర్, మాజీ ఎంపీపీ వెంకటయ్య, బీజేపీ నాయకులు శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మున్సిపల్ చైర్మన్ నరేందర్



ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన నరేందర్

షాద్‌నగర్: పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోషక విలువలు అధికంగా ఉండే పాలు, గుడ్లు, పప్పు దినుసులు, తాజా ఆకు కూరలు, పండ్లు వంటి వాటిని అధికంగా తినాలని సూచించారు. శరీరం, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో గోపాల్‌గుప్త, యాదగిరి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కంటి వెలుగు సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: కంటి వెలుగు కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై గురువారం డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో చాలా మంది నిరుపేదలు గుండెపోటుకు గురవుతుంటారని అన్నారు. గుండెపోటు వచ్చిన వెంటనే ఆరోగ్య సిబ్బంది వారికి సీపీఆర్ చేయడం ద్వారా వారి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. గుండెపోటుకు గురై కింద పడిపోయి మాట లేకుండా ఉన్న వ్యక్తిని తట్టి లేపినా లేవకపోయినట్లయితే సీపీఆర్ టెక్నిక్‌తో గుండెపై 30సార్లు గట్టిగా రెండు చేతులతో నొక్కాలని తెలిపారు. అదేవిధంగా నోటి సహాయంతో ఆక్సిజన్ అందించాలని చెప్పారు. తద్వారా గుండె మళ్లీ పని చేస్తుందన్నారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని రక్షించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంటి వెలుగు శిబిరం సిబ్బంది, ఆప్తమాలజిస్టులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నిబంధనలకు 'నీళ్లు'

లైసెన్సులు లేకుండానే 35 మినరల్ వాటర్ ప్లాంట్లు

- పట్టించుకోని అధికారులు



ఆటోలో సరఫరా చేస్తున్న మినరల్ వాటర్

షాబాద్: మినరల్ వాటర్ ముసుగులో కొందరు అక్రమార్కులు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని చెబుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం సాగిస్తున్నారు. షాబాద్ మండలంలో సుమారు 35 వాటర్ ప్లాంట్లు ఉన్నా అందులో ఒక్క దానికి కూడా అనుమతి లేకపోవడం గమనార్హం. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని, రంగు రంగుల బోర్డులతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా కనీసం నీటిని శుద్ధి చేస్తున్నారా లేదానే విమర్శలు వినిపిస్తున్నాయి. నీటి సరఫరా చేసే బాటిళ్లలో చెత్త చెదారం దర్శనమిస్తున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. పట్టణాలకే పరిమితమైన మినరల్ వాటర్ ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు పాకింది. మండలంలో నీటి బాటిళ్లు, ప్యాకెట్లు తయారు చేస్తూ వేరే చిరునామాతో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్‌కు రూ. 20పైసలు ఖర్చు అవుతున్నా వాటిని రూ.2లకు అమ్ముతున్నారు. 20లీటర్ల బాటిల్‌ను రూ.10 నుంచి, రూ.15లకు అమ్ముతున్నారు. ట్యాంకర్ల ద్వారా బిందెకు రూ.5 వసూలు చేస్తున్నారు.

పట్టించుకోని సంబంధిత అధికారులు

అనుమతిలేని ప్లాంట్లు అనేకం ఉన్నా అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. వారి నిర్లక్ష్యం కారణంగా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముంది. లైసెన్స్‌లు లేని వాటర్ ప్లాంట్లలను సీజ్ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. అవినీతి వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.